క్లుప్తంగా

జగ్గిరెడ్డిని కలిసిన శివకుమార్



కొత్తపేటలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డిని సత్కరిస్తున్న శివకుమార్

సఖినేటిపల్లి: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి (పార్లమెంట్), కొత్తపేట నియోజకవర్గ పరిశీలకుడు రామేశ్వరానికి చెందిన పాటి శివకుమార్ మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. కొత్తపేటలో జగ్గిరెడ్డిని కలిసిన శివకుమార్, ఆయనను శాలువాతో సత్కరించారు.

చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన అధ్యక్షుడిగా పోతంశెట్టి



పోతంశెట్టి కనికిరెడ్డిని అభినందిస్తున్న నాగిరెడ్డి తదితరులు

రావులపాలెం: స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన అధ్యక్షుడిగా పోతంశెట్టి కనికిరెడ్డి ఎన్నికయ్యారు. స్థానిక ఛాంబర్ అసోసియేషన్ భవనంలో ప్రస్తుత అధ్యక్షుడు కర్రి నాగిరెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో నూతన అధ్యక్షుడుగా కనికిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సెక్రటరీగా ఎం.సూరిబాబు, ట్రెజరర్‌గా మండవల్లి నగేష్‌తో పాటు ముగ్గురు వైస్ ప్రెసిడెంట్లను, ముగ్గురు జాయింట్ సెక్రటరీలను, జాయింట్ ట్రెజరర్‌ను ఎన్నుకున్నట్టు నూతన అధ్యక్షుడు కనికిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి ప్రస్తుత అధ్యక్షుడు కర్రి నాగిరెడ్డి అభినందనలు తెలిపారు.

అవార్డు గ్రహీత ప్రభావతికి అభినందనలు

సఖినేటిపల్లి: సఖినేటిపల్లిలంక జెడ్పీ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గుండేపల్లి ప్రభావతిని అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమెను, ఎంపీడీవో కె.సూర్యనారాయణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, ఎంపీటీసీ మందపాటి రత్నం అభినందించారు. నల్లి సురేంద్ర, మందపాటి సత్యనారాయణ, చెంపాటి రామకృష్ణంరాజు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ

పి.గన్నవరం: మానేపల్లి బాలికోన్నత పాఠశాలలో చదువుతున్న 20 మంది క్రీడాకారులకు హెచ్ఎం కేవీ సూర్యనారాయణ మూర్తి మంగళవారం రూ.10 వేల విలువైన క్రీడా దుస్తులను అందజేశారు. తన తండ్రి కొమ్మాజోస్యుల వెంకటసుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం వీటిని అందించినట్టు మూర్తి వివరించారు. ఆయనను ఎస్ఎంసీ చైర్ పర్సన్ కొమ్ముల రమాదేవి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం

కొత్తపేట: మహిళా సంరక్షణ చట్టాలపై అవగాహన అవసరమని సఖి వన్ స్టాప్ సెంటర్ సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్ అంబికాదేవి సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని శ్రీకృష్ణదేవరాయ సభా ప్రాంగణంలో మహిళా సమస్యలు, బాధిత మహిళల సంక్షేమం, సంరక్షణపై సఖి వన్ స్టాప్ సెంటర్ మిషన్ శక్తి సంకల్ప అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్) స్థానిక ప్రాజెక్టు అధికారిణి గజలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అంబికాదేవి మాట్లాడుతూ మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా రక్షణ పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలు వ్యవసాయంలోనూ రాణించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవవరప్రసాద్

మలికిపురం: మహిళలు వ్యవసాయ రంగంలోనూ రాణించాలని రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్ అన్నారు. నియోజకవర్గంలోని 117 మహిళా రైతు సంఘాలకు కేంద్రం ద్వారా సెర్ప్ నుంచి మంజూరైన రూ.11.70 లక్షల రివాల్వింగ్ ఫండ్‌ను మంగళవారం ఆయా సంఘాలకు ఎమ్మెల్యే విశ్వేశ్వరాయపురంలోని క్యాంపు కార్యాలయం వద్ద అందించారు. 68 మందికి రూ.65.15 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందించారు. ఏపీ మార్క్ ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, ఎంపీపీ మేడిచర్ల వెంకటసత్యావాణి, ఏఎంసీ చైర్మన్ కేతా వెంకట లక్ష్మి, మహిళా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

అన్నదాతకు బాసటగా పోరు



ముక్కామల నుంచి కొత్తపేట తరలివెళ్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



కొత్తపేటలో రోడ్డుపై బైఠాయించిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి



అమలాపురం ఆర్డీవో కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, నియోజకవర్గాల కో ఆర్డినేటర్లు సూర్యారావు, సతీష్‌కుమార్, శ్రీకాంత్

- కొత్తపేటలో కదం తొక్కిన రైతులు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో నిరసన
- రైతులకు కూటమి అన్యాయంపై నినదించిన పార్టీ శ్రేణులు, రైతులు
- పాదయాత్రను అడుగడుగునా అడ్డుకున్న పోలీసు అధికారులు
- ఆర్డీఓకు వినతిపత్రం అందజేత

కొత్తపేట: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలు, ఎరువులు బ్లాక్ మార్కెట్, ముఖ్యంగా యూరియా కొరతపై కొత్తపేటలో రైతులు కదం తొక్కారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన రైతు సంక్షేమ పథకాలను నేటి కూటమి ప్రభుత్వం విస్మరించింది. పంటల సాగుకు అవసరమైన ఎరువులు సరఫరా చేయకుండా, వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేయడంపై అన్నదాతలకు బాసటగా వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 'అన్నదాత పోరు' పేరిట నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చారు. డివిజన్ కేంద్రం కొత్తపేటలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో రైతులు కదం తొక్కారు. నియోజకవర్గంలోని రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు మండలాల పరిధిలో 47 గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు, రైతులు నియోజకవర్గ ప్రధాన కూడలి రావులపాలెంలో పార్టీ కార్యాలయం వద్దకు చేరుకోగా అక్కడి నుంచి కొత్తపేటలో జిల్లా పార్టీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు స్వగృహం వద్దకు తరలివచ్చారు. అప్పటికే కొత్తపేట మండలంతో పాటు పి.గన్నవరం నియోజకవర్గ పార్టీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు అక్కడికి చేరుకున్నారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర వైఎస్సార్ సీపీ రైతు విభాగం అధ్యక్షుడు జున్నూరి రామారావు (బాబీ), జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, మాజీ ఎంపీ చింతా అనూరాధ, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి తదితర నాయకులు, వేలాదిగా పార్టీ శ్రేణులు, రైతులు భారీ సంఖ్యలో పాదయాత్రగా ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లారు.

రైతుల నోట్లో మట్టి కొడుతున్న కూటమి ప్రభుత్వం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతుల నోట్లో మట్టి కొడుతోందని జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి తీవ్రంగా ధ్వజమెత్తారు. కొత్తపేటలో ఆర్డీఓకు వినతిపత్రం సమర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు యూరియా అందకుండా కూటమి పాలకులు బ్లాక్‌మార్కెట్‌కు తరలించారని ఆరోపించారు. రైతు వ్యతిరేకి అయిన సీఎం చంద్రబాబునాయుడు, గాఢ నిద్రలో ఉన్న వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఇద్దరూ పాలన గాలికి వదిలేసి, రైతులను నట్టేట ముంచేశారని విమర్శించారు. యూరియా అంతా దళారుల చేతుల్లోకి వెళ్లిపోవడంతో 267 రూపాయలకు లభించే యూరియా బస్తా నేడు రూ.400 నుంచి రూ.600 బ్లాక్ మార్కెట్లో విక్రయించే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి పిలుపుమేరకు రైతు పోరుబాట కార్యక్రమం నిర్వహించామన్నారు. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఎరువుల కొరతపై వాస్తవాలు మాట్లాడాలని అన్నారు. రైతులకు యూరియా అందించే వరకూ ఉద్యమిస్తామని జగ్గిరెడ్డి హెచ్చరించారు. పాదయాత్రకు అడ్డంకులు సృష్టించడంతో జగ్గిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీలు మార్గన గంగాధరరావు, తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యులు కుడిపూడి శ్రీనివాసరావు, రాష్ట్ర యూత్ విభాగం కార్యదర్శి పాముల దేవీప్రకాష్, మండల పార్టీ అధ్యక్షులు ముత్యాల వీరభద్రరావు, కనుమూరి శ్రీనివాసరాజు, తమ్మన శ్రీనివాసరావు, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు పెదపూడి బాపిరాజు, సీనియర్ నాయకులు ముసునూరి వెంకటేశ్వరావు, కర్రి నాగిరెడ్డి, గొలుగూరి మునిరెడ్డి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు గుత్తుల శ్రీనివాస్, కార్యదర్శి బండారు దొరబాబు, కార్యవర్గ సభ్యుడు షేక్ వల్లీ బాబా, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, సర్పంచ్‌లు రెడ్డి చంటి, సాగి బంగార్రాజు, బొక్కా కరుణాకర్, అంబటి సుబ్బలక్ష్మి, కర్రి గోవిందకృష్ణారెడ్డి, గంటి నాగేశ్వరరావు, ఆత్రేయపురం వైస్ ఎంపీపీ పెన్మెత్స బంగార్రాజు, జెడ్పీటీసీ మాజీ సభ్యులు సాకా ప్రసన్నకుమార్, బొక్కా వెంకటలక్ష్మి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ చిలువూరి రామకృష్ణంరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మట్టపర్తి వెంకట్రావు, ఐటీ విభాగం అధ్యక్షుడు కొవ్వూరి సుధాకరరెడ్డి, ఇందుకూరి కృష్ణంరాజు, మాజీ ఏజీపీ నామాల శ్రీను, వివిధ విభాగాల అధ్యక్షులు గూడపాటి ప్రవీణ్‌కుమార్, నెక్కంటి బుజ్జి, గారపాటి సుబ్బారావు, సఖినేటి వాకులరాజు, మాగాపు చక్రవర్తి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల గ్రామ శాఖల అధ్యక్షులు పాల్గొన్నారు.

రోడ్డుపై బైఠాయించి నిరసన

కొత్తపేట: డీఎస్పీ సుంకర మురళీమోహన్ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు కేవలం 40 మందికి మాత్రమే అనుమతి ఉందని పార్టీ శ్రేణుల పాదయాత్రను అడ్డుకునే ప్రయత్నం చేశారు. జగ్గిరెడ్డి నాయకత్వంలో జనం ముందుకు సాగారు. స్పెషల్ ఫోర్స్ సిబ్బందితో మరోసారి అడ్డుకోగా పోలీసుల ఆంక్షలు, చర్యలకు నిరసనగా జగ్గిరెడ్డి రోడ్డుపై బైఠాయించారు. కొంతసేపు అనంతరం ఒక పోలీసు అధికారి విజ్ఞప్తి మేరకు మరలా పాదయాత్ర కొనసాగించారు. పాదయాత్ర సాగుతుండగా ఆర్డీఓ కార్యాలయానికి ముందు డీఎస్పీ మురళీమోహన్, అధికారులు, సిబ్బందితో పాదయాత్రను అడ్డుకుని, ప్రధాన నాయకులు మాత్రమే వెళ్లి, మిగిలిన వారు ఆగిపోవాలని కోరారు. శాంతియుతంగా కార్యక్రమం నిర్వహిస్తుంటే అడ్డంకులేమిటని జగ్గిరెడ్డి ప్రశ్నించారు. పోలీసులు నిలువరించే ప్రయత్నం చేసినా పాదయాత్ర కొనసాగింది. నాయకులతో కలిసి జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి ఆర్డీఓ పి. శ్రీకర్‌కు వినతి పత్రం సమర్పించారు.

కూటమి నేతల కనుసన్నల్లోనే బ్లాక్ మార్కెట్‌కు యూరియా

అయినవిల్లి: కొత్తపేట ఆర్డీఓ కార్యాలయానికి అయినవిల్లి మండలం నుంచి భారీ ఎత్తున రైతు నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులు తరలివెళ్లారు. పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భారీ ఎత్తున తరలివెళ్లారు. మండలం 21 గ్రామాల నుంచి అంబాజీపేట మండలం ముక్కామల చేరుకుని అక్కడి నుంచి కొత్తపేట ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా గన్నవరపు శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి నేతల కనుసన్నల్లోనే పెద్ద ఎత్తున బ్లాక్ మార్కెట్‌లో యూరియాను అధిక ధరలకు అమ్ముతున్నారని ఆరోపించారు.

అన్నదాత పోరుకు తరలివెళ్లిన రైతులు

రాజోలు: కూటమి ప్రభుత్వంపై గళమెత్తేందుకు అన్నదాత పోరుకు రాజోలు నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం తరలివెళ్లారు. తాటిపాక సెంటరు నుంచి సుమారు 200 మంది మోటార్‌సైకిళ్ల ర్యాలీగా అమలాపురం ఆర్డీవో కార్యాలయానికి వెళ్లారు. తొలుత మాజీ ఏఎంసీ చైర్మన్ పితాని రాంబాబు స్వగృహం వద్ద పార్టీ కార్యకర్తలతో గొల్లపల్లి సమావేశమయ్యారు. అన్నదాత పోరుకు తరలివచ్చిన రైతులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వ పాలనలో రైతులు పూర్తిగా నష్టపోయారన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రుద్రరాజు చిన్నరాజా, మాజీ ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజా రమణి, తాడి సహదేవ్, ఉచ్చుల దాసు, పార్టీ రాష్ట్ర ప్రచార విభాగం అధికార ప్రతినిధి తెన్నేటి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట తరలిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

అంబాజీపేట: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కొత్తపేటలో మంగళవారం నిర్వహించిన అన్నదాత పోరు కార్యక్రమానికి ముక్కామల సెంటర్ నుంచి ఆ పార్టీ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. కొత్తపేట వెళ్లిన వారిలో పి.గన్నవరం నియోజకవర్గం కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల శేఖర్, పార్టీ నేతలు గుత్తుల నాగబాబు, సూదాబత్తుల రాము, ఎంఎం శెట్టి, యల్లమెల్లి జై బాబు, బుడితి సత్యానారాయణమ్మ, రాధాబాయ్ తదితరులు ఉన్నారు.



కొత్తపేట ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లిన రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు



మాజీ మంత్రి గొల్లపల్లి ఆధ్వర్యంలో అన్నదాత పోరుకు వెళుతున్న నాయకులు



కొత్తపేటలో ఆర్డీఓ శ్రీకర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న చిర్ల జగ్గిరెడ్డి, శ్రీనివాసరావు



కొత్తపేటలో చిర్ల జగ్గిరెడ్డి, పార్టీ శ్రేణులను అడ్డుకుంటున్న పోలీసులు

ఆత్మీయ కలయిక





వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన ఆదినారాయణ, మణిరత్నం

అంబాజీపేట: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం తాడేపల్లిలో పుల్లేటికుర్రుకు చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు ముత్తాబత్తుల మణిరత్నం, మరో నేత చప్పిడి ఆదినారాయణ (పండు) మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ చేపట్టే కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తూ, పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు వివరించాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారని వారన్నారు.

ప్రొటోకాల్ ఉల్లంఘన

మహిళా పారిశ్రామిక వేత్తల సదస్సులో ఎంపీపీకి అవమానం

రాజోలు: శివకోటి గురుకుల పాఠశాలలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ అవగాహన సదస్సు రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సదస్సులో మహిళా ప్రజాప్రతినిధిని కనీసం గౌరవం కరువైంది. మహిళల కోసం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సు కోసం ఏర్పాటు చేసిన వేదికపైకి మహిళా ప్రజాప్రతినిధులను ఆహ్వానించలేదు. వేదికపై ఉన్న కుర్చీల్లో ఎలాంటి ప్రొటోకాల్ లేని తెలుగదేశం, జనసేన పార్టీ నాయకులు ఆశీనులయ్యారు. మండల పరిషత్ అధ్యక్షురాలు కడలి శ్రీదుర్గ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణమూర్తి వేదికకు ఎదురుగా కూర్చోవలసి వచ్చింది. ప్రొటోకాల్ ప్రకారం మండల పరిషత్ అధ్యక్షురాలైన కడలి శ్రీదుర్గ అధ్యక్షతన సదస్సు నిర్వహించాలి. కనీసం ఆమె కూర్చునేందుకు కూడా వేదికపై కుర్చీ లేకుండా కూటమి నాయకులు వెళ్లి దర్జాగా కూర్చున్నారు. దీనిపై విమర్శలు రావడంతో ఒక పక్కన ఎంపీపీ శ్రీదుర్గకు కుర్చీ వేశారు. ఎంపీపీ శ్రీదుర్గకు కనీస గౌరవం ఇవ్వకుండా అగౌరవపర్చడం చాలా దారుణమని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రొటోకాల్ పాటించే విధంగా ఎమ్మెల్యే, అధికారులు చొరవ తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. డీసీఐ జనరల్ మేనేజర్ ఎస్.అరుణ, ఏపీఎం వర్మ, నీటి పంపిణీ సంఘ చైర్మన్ పినిశెట్టి బుజ్జి, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీనివాస్, టీడీపీ నాయకుడు చాగంటి స్వామి, సొసైటీ అధ్యక్షుడు కసుకుర్తి త్రినాథ్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

సామూహికంగా ఎలుకల నిర్మూలన చేపట్టాలి

మామిడికుదురు: రైతులు సామూహికంగా ఎలుకల నిర్మూలన చేపట్టాలని ఏఓ ఎస్‌వీవీ సత్యనారాయణ సూచించారు. నగరంలో రైతులకు ఉచితంగా ఎలుకల నిర్మూలన మందును మంగళవారం పంపిణీ చేశారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఇబ్రహీమ్, పంచాయతీ కార్యదర్శి సురేష్, వీఆర్వో శ్రీనివాస్, స్థానికులు జాలెం సుబ్బారావు, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

65 మందికి కంటి వైద్య పరీక్షలు

పి.గన్నవరం: ముంగండలో మంత్రవాది ఇందిరా కుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 65 మందికి కంటి పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. వారిలో 13 మందికి ఉచితంగా ఆపరేషన్లు చేయాలని నిర్ధారించినట్టు హోమియో వైద్యుడు ఖండవిల్లి నాగేశ్వరరావు తెలిపారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి వైద్య బృందం సేవలందించారు.

ఒప్పందాల ఉల్లంఘనపై ఫిర్యాదు


అలమూరు: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఓఎన్జీసీ గతంలో చేసుకున్న ఒప్పందాలను ఉల్లంఘిస్తోందని మండలంలోని పెదపళ్ల రైతులు ఆరోపించారు. మంగళవారం ఆగ్రామ రైతులు మండల ప్రజా పరిషత్, తహసీల్దార్, పోలీసు స్టేషన్ కార్యాలయాల్లోని మండలస్థాయి అధికారులకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ గతేడాది అక్టోబర్ 15న ఉన్నతాధికారుల సమక్షంలో ఓఎన్జీసీ 15.52 ఎకరాలను భూసేకరణ ఒప్పందం చేసుకుందన్నారు. ఇప్పటికే ఏడాది కావస్తున్నా ఇంకా ఓఎన్జీసీ అధికారులు రైతులకు పరిహారం చెల్లించకపోగా భూసేకరణపై స్పందించడదం లేదని ఆవేదన చెందారు. దీనిపై ఎంపీడీఓ ఏ రాజు, తహసీల్దార్ కేజే ప్రకాష్‌బాబు, ఎస్సై జి.నరేష్ స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఓఎన్జీసీ స్పందించని పక్షంతో ఈనెల 12 నుంచి ఆలమూరు నుంచి గుమ్మిలేరు వెళ్లే రోడ్డులోని మండపేట జీసీఎస్ వద్ద ధర్నా నిర్వహిస్తామని తెలిపారు.



ఆలమూరులో ఎస్సై నరేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న పెదపళ్ల రైతులు

5కే మారథాన్ రన్‌లో కొత్తపేట విద్యార్థుల ప్రతిభ

కొత్తపేట: వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అమలాపురంలో మంగళవారం నిర్వహించిన 5కే మారథాన్ రన్‌లో కొత్తపేట వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచి నగదు బహుమతులు పొందినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు తెలిపారు. యువతలో హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన పెంచేందుకు జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా అడిషనల్ డీఎంఅండ్‌హెచ్ఓ, ఎయిడ్స్, అండ్ లెప్రసీ అధికారిణి డాక్టర్ భరతలక్ష్మి ఆధ్వర్యంలో 5కే మారథాన్ రన్ నిర్వహించారు. కొత్తపేట డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎస్ నాగేంద్రమురళి ప్రథమ స్థానంలో నిలిచి రూ.10 వేలు, బీఎస్ఆర్ రాజు ద్వితీయ స్థానంలో నిలిచి రూ.7 వేలు, మహిళల విభాగంలో వైపీఎస్‌డీ సంతోషి ద్వితీయ స్థానంలో నిలిచి రూ.7 వేలు పొందారు. విజేతలను కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ టీ రమాదేవి, ఎస్‌ఎస్ఎస్ పీఓ డీసీహెచ్ పాపారావు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌చార్జ్ డాక్టర్ కె.అంకమరావు, పీడీ కే కనకరాజు, అధ్యాపకులు అభినందించారు.



అమలాపురంలో రూ.10 వేలు చెక్కు అందుకుంటున్న విజేత మురళి

వృద్ధులకు దుస్తుల వితరణ

అయినవిల్లి: అభాగ్యులైన నిరుపేద వృద్ధులకు దాతల ఔదార్యం అవసరమని స్థానిక ఎస్సై హరికోటి శాస్త్రి అన్నారు. మంగళవారం అయినవిల్లి పెదపేటలో పరలోక అగ్ని అపొస్తలీక్ మినిస్ట్రీ ఆధ్వర్యంలో పాస్టర్స్ పెలోషిప్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్సై హరికోటి శాస్త్రి ముఖ్యఅతిథిగా వ్యవహరించారు. అనంతరం పాస్టర్ ఎస్.పాల్ సమకూర్చిన నిధులతో పాస్టర్లకు, వృద్ధులకు ఎస్సై హరికోటిశాస్త్రి చేతుల మీదుగా నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు, ఏసుబాబ్జీ, సాల్మన్, ఏసుబాబు, ప్రకాశరావు, మోసే, డేవిడ్, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

రావులపాలెం: అగ్నిప్రమాదంలో ఇల్లు కాలిపోయి సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు అండగా నిలిచి సుమారు రూ.60 వేలు విలువైన సాయాన్ని అందజేశారు. ఈతకోటకు చెందిన కొల్లి సత్యవతి ఇల్లు ఆదివారం దగ్ధమవడంతో ఆ కుటుంబం దిక్కు తోచని స్థితిలో ఉన్నారు. శ్రీ కాశీ అన్నపూర్ణా దేవి సేవా సంస్థ సభ్యులు స్పందించి మంగళవారం ఈతకోటలో సత్యవతి కుటుంబానికి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.30,116 చెక్కును, మరో రూ.30 వేలు విలువైన 55 కేజీల బియ్యం, పెద్ద మంచం, నాలుగు మడత మంచాలు, పరుపులు, తలగడలు, ఫ్యాన్, రెండు కుర్చీలు, బియ్యం పెట్టె, నిత్యావసర సరుకులు, కొత్త బట్టలు, వంట సామాన్లు అందజేశారు. సత్యవతి కుటుంబ సభ్యులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.



అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

గర్భిణులకు ప్రత్యేక వైద్య శిబిరం

పి.గన్నవరం: ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నాగుల్లంక పీహెచ్‌సీలో వైద్యాధికారులు వైపీ ప్రియాంక, రియా ఉన్నీషాబేగం ఆధ్వర్యంలో మంగళవారం గర్భిణులకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. 44 మందికి పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. బోళ్ల మురళీమోహనరావు ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారం అందించారు. ఎంపీహెచ్ఈఓ ఎం.రాజశేఖర్, ఎంపీహెచ్ఎస్ బీవీవీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

ఆలమూరు: మాతృత్వ, శిశు మరణాల నివారణకు, చిన్నారుల మెరుగైన ఆరోగ్య సంరక్షణను కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ (పీఎంఎస్ఎంఏ) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.లక్ష్మీస్నేహ, డి.సాయి కిషోర్ అన్నారు. పీఎంఎస్ఎంఏ పథకంలో భాగంగా ఆయా పీహెచ్‌సీల్లో మంగళవారం నిర్వహించిన పీఎంఎస్ఎంఏ 107 మంది బాలింతలు, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ ఎంఎస్ఎన్.రెడ్డి, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవివి.రాజా, బి.సూర్యనారాయణ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

అంబాజీపేట: గర్భిణిలకు లయన్స్ క్లబ్ వశిష్ట సభ్యులు మంగళవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. అంబాజీపేట పీహెచ్‌సీలో నిర్వహించిన కార్యక్రమంలో లయన్ డాక్టర్ ఎ.సుజాత సౌజన్యంతో అవ్వారు సీతమ్మ స్మృత్యర్థం పౌష్టికాహారం పంపిణీ చేశారు.